## రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

కామారెడ్డి, డిసెంబర్ 18 : కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సోమవారం కుటుంబ సమేతంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయనను ఆలయ సిబ్బంది శాలువాతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు. ప్రజలు సుభిక్షంగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## బోర్లం క్యాంపులో వైద్య శిబిరం



బోర్లం క్యాంపు తండాలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 18 : హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని బోర్లం క్యాంపు తండాలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్యుడు ఆమేర్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి మందులను అందజేస్తున్నామని తెలిపారు. వైద్య శిబిరంలో ఏఎన్ఎంలు గంగామణి, అనురాధ, కారోబార్ వినయ్‌కుమార్, ఆశ వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సోపానాలు అనుసరించి బోధించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారులు

మాచారెడ్డి, డిసెంబర్ 18 : ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళిక రూపొందించుకొని సోపానాల ఆధారంగా విద్యాబోధన చేయాలని సమగ్రశిక్ష జిల్లా అకడమిక్ అధికారి వేణుగోపాల్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి శ్రీపతి సూచించారు. మాచారెడ్డిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉన్నతి లక్ష్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటచారి, శ్రీనివాస్, రవి, ఉపాధ్యాయులు సీఆర్పీ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను త్వరగా పరిష్కరించాలి

## కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, డిసెంబర్ 18 : ప్రజావాణిలో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలని అన్నారు. రెవెన్యూకు 34, డీఏవోకు 3, డిస్టిక్ ఎంప్లాయిమెంట్‌కు ఒకటి, బీసీ డెవలప్‌మెంట్‌కు ఒకటి, డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషన్‌కు ఒకటి, డీపీవోకు 15, ఎలక్ట్రిసిటికి మూడు, హౌసింగ్‌కు 10, మున్సిపల్‌కు ఒకటి, డీఆర్డీవోకు రెండు, ఎస్పీ కార్యాలయానికి ఒకటి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు ఒకటి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్‌కు ఒకటి, కలెక్టరేట్‌కు ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఏవో సయ్యద్ మసూద్ అహ్మద్, డీఆర్డీవో సాయన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## కలెక్టర్‌కు ఆటోడ్రైవర్ల వినతి



కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

కామారెడ్డి, డిసెంబర్ 18 : ఆటో డ్రైవర్ల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని ఆటో యూనియన్ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సీఎస్ఐ గ్రౌండ్‌లో సోమవారం సమావేశం ఏర్పాటు చేసుకొని అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది ఆటో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని అన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో తమ జీవనోపాధిని కోల్పోయామని, తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు.

ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా కేంద్రం లో ఆటోనగర్ కాలనీ ఏర్పాటు చేసి ఆరు ఎకరాల స్థలం కేటాయించాలన్నారు. బ్యాంకుల్లో 60 శాతం సబ్సిడీతో రుణాలు ఇప్పించాలని తెలిపారు. ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో మరణిస్తే ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోదాస్ నర్సింహులు, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి గోల్కొండ రాజయ్య, యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవరులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీలు




విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సభ్యులు

కామారెడ్డి, డిసెంబర్ 18 : రోటరీ క్లబ్, సెవెన్ హార్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాసా శాస్త్రవేత్త డాక్టర్ కావ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్లాలని దానికి చదువు ఒకటే మార్గమని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలబోయిన సత్యం, కార్యదర్శి రాజనర్సింహారెడ్డి, కోశాధికారి సుధాకర్, సభ్యులు కాశీనాథం, గంగారెడ్డి, నాగభూషణం, కృష్ణమూర్తి, రమణ, సెవెన్ హార్ట్స్ సంస్థ ప్రతినిధులు, ఫౌండర్ జీవన్ నాయక్, కార్యదర్శి మసూద్, నరేశ్, ఎన్జీవో ప్రతినిధులు, ఉమెన్ వింగ్, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు



దోమకొండలో అయ్యప్ప స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు, భక్తులు

దోమకొండ, డిసెంబర్ 18 : దోమకొండలో అయ్యప్పస్వామి ఆలయ దశమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా సోమవారం అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం 5 గంటలకు మండల కేంద్రంలో పలు ప్రధాన వీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**బాన్సువాడలో..**

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 18 : బాన్సువాడలోని అయ్యప్ప ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అయ్యప్ప ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన పూజారి పాండు, చంద్రశేఖర్ పంతులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి కార్యవర్గ సభ్యులు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి

దోమకొండ, డిసెంబర్ 18: కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు యాసంగి 2023-24 రైతు బంధు కోసం ఆయా గ్రామాల్లోని రైతు వేదికలో దరఖాస్తూ చేసుకోవాలని ఏవో పవన్‌కుమార్ తెలిపారు.

ఆయా గ్రామాల్లో కొత్త పట్టా పాస్ బుక్‌లు వచ్చిన రైతులు వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తూపత్రం, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ తీసువచ్చి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## 23 నుంచి జిల్లాస్థాయి యువజనోత్సవాలు

కామారెడ్డి, డిసెంబర్ 18 : జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఈ నెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, కలెక్టర్ అనుమతితో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో యువజనోత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం, జానపద గీతాలు (ఫోక్ సాంగ్ గ్రూప్), జానపద గీతాలు (వ్యక్తిగత, సోలో), లైఫ్ స్కిల్ విభాగంలో కథ రచన, పోస్టర్ మేకింగ్, ఫొటోగ్రఫి తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను జనవరి 2024 మొదటి వారంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే యువతీ యువకుల వయస్సు 15 నుంచి 29 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే కళాకారులు ఈ నెల 20వ తేదీ వరకు dysokamareddy2016@gmail.com మెయిల్ ద్వారా లేదా 9440292793, 9618126053 వాట్సాప్ నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రెండు కలర్ ఫొటోలు, ఆధార్ కార్డు లేదా పుట్టిన తేదీ సర్టిఫికెట్ జిరాక్స్‌లతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా యువజన, క్రీడల కార్యాలయం రూం నంబర్ 223లో సంప్రదించాలని తెలిపారు.